## క్లుప్తంగా

### నేడు సర్వసభ్య సమావేశం

బంట్వారం: బంట్వారం సహకార సంఘం సర్వసభ్య సమావేశం సంఘం కార్యాలయంలో శనివారం నిర్వహిస్తున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ రాంచంద్రారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. సంఘ సభ్యులు, డైరెక్టర్లు సకాలంలో హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

### వరి పంటల పరిశీలన

యాలాల: మండల పరిధిలోని కమాల్‌పూర్, నాగసముందర్, యాలాల, విశ్వనాథ్‌పూర్ తదితర గ్రామాల్లో శుక్రవారం వ్యవసాయ అధికారులు పర్యటించి సాగులో ఉనన వరి పంటలను పరిశీలించారు. పంటలో బ్యాక్టీరియా సోకి ఆకు ఎండు తెగులు ఉధృతిని గుర్తించారు. బ్యాక్టీరియా నివారణకు గాను స్ట్రెప్టోసైక్లిన్ లేదా ప్లాంటమైసిన్ 100 గ్రాముల మందును 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఉధృతి తగ్గుతుందన్నారు. మండల పరిధిలో యాసంగిలో 10,949 ఎకరాల్లో వరిపంటను రైతులు సాగు చేశారని తెలిపారు. వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి యాదగిరి, రైతులు పాల్గొన్నారు.

### ఆర్థికసాయం అందజేత

పరిగి: పట్టణ కేంద్రంలోని టీచర్స్ కాలనీకి చెందిన శంకర్ మృతిచెందాడు. విషయం తెలుసుకున్న డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్ మృతుడి అంత్యక్రియల నిమిత్తం కుటుంబానికి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కృష్ణ, ఉపాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, నాయకులు నర్సింహులు, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

### అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు భూమిపూజ



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: అంబేడ్కర్ ఆశయ సాధనకై యువత ముందుకుసాగాలని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. శుక్రవారం చౌడాపూర్ మండల పరిధిలోని మొగుళ్లపల్లి గ్రామంలో అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపనకు సంబంధించి భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుల్కచర్ల జెడ్పీటీసీ రాందాస్ నాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పీఏసీఎస్ వైస్ చైర్మన్ నాగరాజు, మరికల్ సర్పంచ్ పాండు, పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్, బీఆర్ఎస్ మండల యూత్ వింగ్ అధ్యక్షుడు మేగ్యానాయక్, నాయకులు చెన్నయ్య, అశోక్, వెంకటయ్య, రవి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

### దరఖాస్తు గడువు పెంపు

తాండూరు టౌన్: తెలంగాణ రాష్ట్ర సాంఘీక సంక్షేమ, గిరిజన, బీసీ తదితర ప్రభుత్వ గురుకులాల్లో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తు గడువును ఈనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కోకట్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 4వ తరగతి చదువుతున్న విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు 9 ఏళ్ల నిండి 11 ఏళ్లు దాటని వారు.. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 13 ఏళ్లు దాటని వారు అర్హులన్నారు. అలాగే తల్లిదండ్రుల ఆదాయం గ్రామీణ ప్రాంతవాసులైతే రూ.1.50 లక్షలు, పట్టణవాసులైతే రూ.2లక్షల వార్షిక ఆదాయాన్ని మించి ఉండరాదన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 23వ తేదీన నిర్వహిస్తారన్నారు. అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

### రోడ్డు పనుల పరిశీలన

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వేస్తున్న రోడ్డు పనులను కౌన్సిలర్ మధుయాదవ్, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకులు శ్రీనివాస్ శుక్రవారం పరిశీలించారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా రోడ్డు వేసి భక్తులకు ఇబ్బంది లేకుండా చూస్తానని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి గతంలో హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ మేరకు రోడ్డు పనులు ముగింపు దశకు వచ్చాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా 19వ తేదీన ధ్వజారోహణం, తిరుచ్చి వాహనంతో పాటు ప్రతిరోజు మాడ వీధుల్లో ఊరేగింపు కార్యక్రమాలు ఉంటాయి.

### కంటివెలుగుతో నిరుపేదలకు మేలు

మండల వైద్యాధికారి మాధురి

కుల్కచర్ల: కంటి వెలుగు శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి మాధురి, కంటి వైద్యాధికారి జవహర్ అన్నారు. శుక్రవారం కుల్కచర్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించిన కంటివెలుగు శిబిరంలో 39 మందిని కంటి ఆపరేషన్ల నిమిత్తం నగరానికి తరలించారు. కంటి ఇబ్బందులు అధికంగా ఉన్న వారికి మాత్రమే ఆపరేషన్లు నిర్వహించడం జరుగుతుందని.. సాధారణ సమస్యలు ఉన్న వారికి కళ్లద్దాలను ఇక్కడే అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ శిబిరాలతో నిరుపేదలకు మేలు జరుగుతుందన్నారు. సీహెచ్ఓ చంద్రప్రకాశ్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# నజరానా.. కథ కంచికేనా?

**గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించకుండా ఏకాభిప్రాయంతో సర్పంచులను ఎన్నుకుంటే.. ఆయా గ్రామపంచాయతీలకు రూ.10 లక్షల నజరానా అంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఎన్నికలు జరిగి, ఆ ప్రజాప్రతినిధుల పదవీ కాలం పూర్తికావస్తున్నా.. అందాల్సిన కానుక మాత్రం అందని ద్రాక్షలాగే మారింది. ఆశపడిన నేతలకు నిరాశే మిగిలింది.**

- ఏకగ్రీవ పంచాయతీలకు ప్రత్యేక నిధుల హామీ ఊసెత్తని సర్కార్
- సర్పంచ్‌ల పదవీకాలం పూర్తికావచ్చినా.. జమకాని నజరానా
- ఆవేదనలో గ్రామ ప్రథమ పౌరులు




ఏకగ్రీవంగా ఎన్నికైన గోరిగడ్డ గ్రామ పంచాయతీ

కుల్కచర్ల: పోటీ లేకుండా ఏకగ్రీవంగా సర్పంచులను ఎన్నుకుంటే రూ.10 లక్షలు ఆ గ్రామానికి కానుకగా ఇస్తామని నాడు అధికర పార్టీ హామీ ఇవ్వడంతో 8 జీపీల్లో సర్పంచ్‌లను ఎన్నుకున్నారు. మండలంలో 44 గ్రామపంచాయతీలు ఉండగా.. అల్లాపూర్, హన్మానాయక్, భజ్యానాయక్, బిందెంగడ్డ, చెరువు ముందలి, లాల్‌సింగ్, పటేల్ చెరువు, గోరిగడ్డ తండాలు మొత్తంగా 8 జీపీల్లో పోటీ లేకుండా ఎన్నిక జరిగింది. అయితే ఎన్నుకున్న గ్రామ ప్రథమపౌరుడి పదవీ కాలం గడువు ముంచుకొస్తున్నా.. నేటి వరకు నజరాన రాలేదని, ఆ ప్రత్యేక నిధులు వచ్చుంటే గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకునే వారమని పలువురు వాపోతున్నారు.

**పెద్ద జీపీలకు రూ.15లక్షలు**

సాధారణంగా ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామపంచాయతీలకు రూ.10లక్షల నజరాన ఇచ్చే ప్రక్రియ గత ప్రభుత్వాలు కొనసాగించాయి. అదే దోవలో బీఆర్ఎస్ ప్రభుత్వం పయనించి.. మరో రూ.5లక్షల ఎమ్మెల్యే నిధులను అదనంగా చేర్చి మొత్తం రూ.15 లక్షలు కానుక ఇస్తామని ప్రకటించింది. అందులో మేజర్ గ్రామపంచాయతీలకు రూ.15లక్షలు, చిన్న జీపీలకు 10లక్షలు ఇస్తామని నాటి సర్పంచి ఎన్నికల సందర్భంగా పేర్కొంది. కానీ.. కార్యరూపం దాల్చలేక పోయింది. దీంతో ప్రభుత్వం మాట ఉత్తిదేనని పలువురు నాయకులు విమర్శిస్తున్నారు.

**ముగియనున్న పదవీకాలం**

2019 జనవరి 30న గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగగా.. ఫిబ్రవరి 2వ తేదీన సర్పంచులు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రస్తుతం సర్పంచులుగా కొనసాగుతున్నా.. వారి పదవీకాలం ఇంకా 9నెలలు మాత్రమే ఉంది. ఏది ఏమైనా గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి నిధులు అందించాల్సిన ప్రభుత్వం.. ప్రత్యేక కానుక మరిచిపోవడంతో ఆయా గ్రామాల సర్పంచులు ఆవేదన చెందుతున్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఏకగ్రీవ పంచాయతీలకు నజరానా ప్రకటించాలని కోరుతున్నారు.

**కానుక ఇస్తే మరింత అభివృద్ధి**



ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలకు ప్రత్యేక నిధులు అందిస్తామని పేర్కొన్న విధంగా రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తే.. మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవకాశం ఉంటుంది. ప్రభుత్వం ఆ దిశగా ఆలోచించి గ్రామీణ ప్రాంతాల అభ్యున్నతికి సహకరించాలి.

– శివిబాయి, సర్పంచ్, అల్లాపూర్

**ప్రభుత్వ పరిధిలో ఉంది**



ఏకగ్రీవ గ్రామపంచాయతీలకు ప్రత్యేక నిధులు ఇచ్చే అంశం ప్రభుత్వ పరిధిలో ఉంది. ఆ నిధుల ప్రతిపాదన గురించి మాకు ఎలాంటి సమాచారం లేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే, సాధారణ, ఉపాధిహామీ నిధులను గ్రామాలకు కేటాయించి పనులను నిర్వహింపజేయడం జరుగుతోంది.

– కరీం, ఎంపీఓ, కుల్కచర్ల

# బీజేవైఎం నేతల ముందస్తు అరెస్టు



వికారాబాద్ పీఎస్‌లో బీజేవైఎం నాయకులు

తాండూరు టౌన్: టీఎస్‌పీఎస్సీ పరీక్ష పత్రాల లీకేజీకి నిరసనగా బీజేవైఎం ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌ల ముట్టడికి వెళ్తున్న నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్ ఆధ్వర్యంలో తాండూరు పట్టణానికి చెందిన బీజేవైఎం, ఏబీవీపీ నాయకులు ర్యాలీగా కలెక్టరేట్ ముట్టడికి వెళ్తుండగా తాండూర్ పట్టణ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. అరెస్టయిన వారిలో బీజేవైఎం జిల్లా కోశాధికారి గోవింద్ అసావా, పట్టణ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి నరేష్, ఏబీవీపీ జిల్లా కన్వీనర్ ఉప్పల రాజేష్, భానుతేజ, సంజీవ్ తదితరులు ఉన్నారు. సొంత పూచీకత్తుపై అనంతరం వదిలివేశారు.

**బంట్వారం మండలం నుంచి..**

బంట్వారం: టీఎస్‌పీఎస్సీ పరీక్షా పత్రాల లీకేజీని నిరసిస్తూ శుక్రవారం ఏబీవీపీ బంట్వారం మండల అధ్యక్షుడు సతీష్, బీజేవైఎం నాయకులు శేఖర్, నవీన్ తదితరులు కలెక్టరేట్ ముట్టడికి యత్నించగా పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. టీఎస్‌పీఎస్సీ నిరుపేద విద్యార్థుల జీవితాలతో ఆటలాడుకుంటుందని అన్నారు. వెంటనే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఏఎస్ఐ అంజాద్ ఆధ్వర్యంలో నిరసనకారులను స్టేషన్‌కు తరలించి కొద్ది సేపటికి వదిలిపెట్టారు.

**వికారాబాద్ పట్టణం నుంచి..**

అనంతగిరి: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ విషయంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ శుక్రవారం తలపెట్టిన దీక్షకు మద్దతుగా వికారాబాద్ బీజేవైఎం నాయకులు హైదరాబాద్‌కు వెళ్తుండగా వికారాబాద్ పట్టణ పోలీసులు ఉదయమే వారిని అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో బీజేవైయం రాష్ట్ర నాయకులు నందు తదితరులు ఉన్నారు.

**పోరాటాలను ఆపలేరు..**

కుల్కచర్ల: అక్రమ నిర్బంధాలతో పోరాటాలను ఆపలేరని ఏబీవీపీ రాష్ట్రకార్యవర్గ సభ్యులు వార్ల సాయికిరణ్ గౌడ్ అన్నారు. టీఎస్‌పీఎస్సీ పరీక్షల పేపర్ లీక్‌లకు నిరసనగా కుల్కచర్ల నుంచి శుక్రవారం చలో కలెక్టరేట్‌కు వెళ్తున్న ఏబీవీపీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. పరీక్షల పేపర్ల లీకేజీతో నిరుపేద విద్యార్థులు చాలా నష్టపోయారన్నారు. అరెస్టయిన వారిలో నాయకులు హరికృష్ణ, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# కొడంగల్‌లో జోడో యాత్ర

కొడంగల్: మండల పరిధిలోని పలు గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం హాత్ సే హాత్ జోడో యాత్ర నిర్వహించారు. ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు రేవంత్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతోందన్నారు. నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డిని అత్యధిక మెజారీతో గెలిపించుకుందామన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, మండల కమిటీ అధ్యక్షుడు ప్రశాంత్, వర్కింగ్ ప్రసిడెంట్ ఆనందొరెడ్డి, మైనార్టీ నాయకులు ఆసీఫ్‌ఖాన్, నయీం, గిరిజన సంఘం నాయకులు తార్యానాయక్, అంబయ్య గౌడ్, శివప్ప తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారులను ప్రోత్సహిస్తాం



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎంపీపీ అనురాధ

ఎంపీపీ అనురాధ

పెద్దేముల్: బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను పోత్సహిస్తోందని ఎంపీపీ అనురాధ అన్నారు. పెద్దేముల్ మండల ఇందూరు గ్రామంలో ఎంపీటీసీ సభ్యుడు ప్రవీణ్‌పటేల్ ఆధ్వర్యంలో నిర్వహించిన పటేల్ వీరశెట్టి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. ఎంపీపీ అనురాధ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. టోర్నమెంట్‌లో సుమారు 70టీంలు పాల్గొనగా తాండూరు జట్టు విజేతగా నిలిచి రూ.50వేల నగదుతో పాటు ట్రోఫీ, తట్టెపల్లి టీంలకు రూ.25వేల నగదుతో పాటు ట్రోఫీని కైవసం చేసుకున్నాయి. ఎంపీపీ మాట్లాడుదూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి గ్రామంలో క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పద్మమ్మ, తాండూరు మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ దీపా నర్సింహులు, మండల వైస్ ఎంపీపీ మధులత, ఎంపీటీసీ ల ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వెంకటేష్‌చారి, మాజీసర్పంచ్‌లు రుక్మాపూర్ రమేష్, ప్రకాశం, నర్సింహులు, మెగులప్ప, ఆర్గనైజర్లు రాజు, అశోక్, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# ఏవీఎన్ రెడ్డి గెలుపుపై ఉపాధ్యాయుల సంబురాలు



బొంరాస్‌పేట: మిఠాయి తినిపించుకుంటున్న ఉపాధ్యాయులు

బొంరాస్‌పేట: తపస్ సంఘం మద్దతు తెలిపిన ఏవీఎన్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందటం పట్ల మండల ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంబురాలు జరుపుకున్నారు. శుక్రవారం మండల విద్యావనరుల కేంద్రం ఎదుట సంఘం అధ్యక్షుడు బాకారం చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వేడుకలు జరుపుకున్నారు. ఆసంఘం నాయకులు పాపిరెడ్డి, రవీందర్‌గౌడ్, శ్రీప్రియ, వెంకటేశం, శశివర్ధ, శంకరప్ప, కోశాధికారి సేవ్య, గోపాల్, లక్ష్మికాంత్ పాల్గొన్నారు.

**కొడంగల్ పట్టణంలో..**

కొడంగల్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ మద్దతుదారుడు, తపస్ ఉపాధ్యాయ సంఘం అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం సాధించిన సందర్భంగా పట్టణంలో శుక్రవారం ఆ సంఘం నేతలు సంబురాలు చేసుకున్నారు. పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు కార్యక్రమంలో ఉపాధ్యాయులు బాకారం చంద్రశేఖర్, బాకారం మల్లయ్య, వెంకటయ్య, క్రాంతి, మొగులప్ప, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

**దోమ మండల కేంద్రంలో..**

దోమ: బీజేపీ మద్దతు తెలిపిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందటం పట్ల శుక్రవారం మండల కేంద్రంలో తపస్ ఉపాధ్యాయ సంఘ నేతలు సంబురాలు జరుపుకున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులను చేపట్టడంలో దారుణంగా విఫలమైందన్నారు. బీజేపీ దోమ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, తపస్ ఉపాధ్యాయ సంఘ నేతలు పాల్గొన్నారు.

**కుల్కచర్లలో..**

కుల్కచర్ల: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో బీజేపీ మద్దతు తెలిపిన అభ్యర్థి ఏవీఎన్ రెడ్డి విజయం పట్ల కుల్కచర్ల మండల కేంద్రంలో బీజేపీ శ్రేణులు సంబురాలు జరుపుకున్నారు. ఇది అధికార బీఆర్ఎస్‌కు చెంప పెట్టు లాంటిదని అన్నారు. బీజేపీపై ఉపాధ్యాయులు, సంఘాలు పెట్టుకున్న నమ్మకం వమ్ముకానీయమన్నారు. బీజేపీ రాష్ట్రకార్యవర్గ సభ్యుడు ప్రహ్లాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య, తపస్ జిల్లా కార్యవర్గ సభ్యులు బుచ్చిలింగం, నాయకులు మైపాల్, శ్రీకాంత్, వెంకటయ్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# సమన్వయంతో పనిచేయాలి

ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి

బంట్వారం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని కోట్‌పల్లి ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించిన కోట్‌పల్లి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హరితహారంలో నాటిన మొక్కలు ఎండకుండా నీరు పట్టాలంటూ ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో నీటిఎద్దడి లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఎక్కడైనా పైప్‌లైన్ల లీకేజీలు ఉంటే సత్వరమే సరిచేయాలన్నారు. మన ఊరు మన బడి పనుల్లో మరింత పురోగతి సాధించాలని పంచాయతీ రాజ్ అధికారులకు సూచించారు. అంతకు ముందు ఆయా శాఖల అధికారులు ఎజెండాలోని అంశాలను సభ్యులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్, ఎంపీడీఓ లక్ష్మీ నారాయణ, తహసీల్దార్ అష్ఫాక్‌రసూల్, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

### పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలి

రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాజిరెడ్డి



బంట్వారం: వడగళ్ల వానకు పంట నష్టపోయిన రైతులందరికీ పరిహారం చెల్లించాలని రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మర్రి రాజిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అకాల వర్షానికి మర్పల్లి, మోమిన్‌పేట, వికారాబాద్ మండలాల్లో వేలాది ఎకరాల్లో ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. మొక్కజొన్న కూడా పూర్తిగా నేలపాలైందన్నారు. ఉద్యాన, వ్యవసాయ శాఖల అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పంట నష్టం అంచనాలను రూపొందించాలన్నారు. ఎకరాకు రూ.20 వేల చొప్పున నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ప్రభుత్వం దిగి రాకుంటే రైతులకు మద్దతుగా పెద్దఎత్తున ఉద్యమం చేపడుతామన్నారు.

### 20లోగా లైఫ్ సర్టిఫికెట్ అందజేయండి

అనంతగిరి: విశ్రాంత ఉద్యోగులందరూ (సర్వీసు పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు) ప్రతి సంవత్సరం ట్రెజరీ కార్యాలయంలో సమర్పించే లైఫ్ సర్టిఫికెట్‌ను ఈ యేడాది ఇంకా సమర్పించని వారు ఈనెల 20లోపు తప్పనిసరిగా అందజేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు మాణిక్‌ప్రభు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రాంతానికి చెందిన ఇంకా 300మందికి పైగా లైఫ్ సర్టిఫికెట్‌లు సమర్పించలేదని అధికారులు చెబుతున్నారని వెంటనే అందజేయాలని ఆయన కోరారు.

### ఎస్‌బీఐలో సిబ్బంది కొరత

బొంరాస్‌పేట: మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్యాంక్‌లో సిబ్బంది కొరతను తక్షణమే తీర్చాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయ మాట్లాడుతూ.. బొంరాస్‌పేట ఎస్‌బీఐ బ్రాంచ్‌లో 8మంది సిబ్బందికిగాను నలుగురు మాత్రమే ఉన్నారని సిబ్బంది కొరత కారణంగా ఖాతాదారులు, వినియోగదారులకు సేవలు సక్రమంగా అందడం లేదన్నారు. సిబ్బంది కొరతను వెంటనే తీర్చకపోతే సీఐటీయూతోపాటు ప్రజా సంఘాలతో ఆందోళన నిర్వహిస్తామన్నారు.

# ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారు

ఎంఈఓకు కౌన్సిలర్ ఫిర్యాదు



ఎంఈఓకు ఫిర్యాదు చేస్తున్న కౌన్సిలర్ బాంబిన

తాండూరు టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ 14వ వార్డు ఎంఐఎం కౌన్సిలర్ పీప బాంబిన డిమాండ్ చేశారు. ఈమేరకు శుక్రవారం ఆర్డీఓ, తహసీల్దార్, ఎంఈఓ కార్యాలయాల్లో ఫిర్యాదు చేశారు. పాత తాండూరులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రిన్సిపాల్ రిజ్వాన్ హుస్సేన్, ఎస్ఎంసీ చైర్మన్ జావీద్ ఎమ్మెల్సీ కోడ్‌ను ఉల్లంఘించి మన ఊరు మన బడి పనులను ప్రారంభించారన్నారు. ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పదవీ కాలం ముగిసినప్పటికీ పాఠశాలలో ఆయన ఆధిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపించారు. ఎలాంటి తీర్మానం లేకుండా పనులు చేపట్టారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు.

# జీపీ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించండి

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్

అనంతగిరి: గ్రామ పంచాయతీ కార్మికులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మైపాల్ అన్నారు. శుక్రవారం తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తుండగా పోలీసులు అరెస్టు చేసి వికారాబాద్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా మైపాల్ మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్మికులకు కనీస వేతనాలు రూ.26వేలు అందించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు.ఉద్యోగ భద్రత కల్పించడంతో పాటు మల్టీపర్పస్ విధానం రద్దు చేసి అందరికి గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. వేతనాలు ప్రతినెల 5లోపు వేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు చంద్రయ్య, రాజు, కుమార్, అశోక్, బోనయ్య, వెంకటమ్మ, యాదయ్య, బాలమణి, దశరథ్, శ్రీనివాస్, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ‘స్వగృహ’ వేలం వాయిదా



మాట్లాడుతున్న డీఆర్ఓ అశోక్‌కుమార్

తాండూరు రూరల్: తాండూరులోని హైదరాబాద్ మార్గంలో రాజీవ్ స్వగృహ ఓపెన్ ప్లాట్ల వేలాన్ని వాయిదా వేసినట్లు డీఆర్ఓ అశోక్‌కుమార్ తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన వేలం కార్యక్రమానికి కొనుగోలుదారుల నుంచి పెద్దగా స్పందన రాలేదు. యాలాల మండలం కోకట్ రెవెన్యూ పరిధిలోని మనోహర టౌన్‌షిప్ రాజీవ్ స్వగృహలో 10 ప్లాట్లు, 54 వివిధ దశల్లో ఉన్న గృహాలను ప్రభుత్వం అమ్మకానికి పెట్టిందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వేలం ఏర్పాటు చేయగా స్పందన లేకపోవడంతో వాయిదా వేశామని తెలిపారు. ఓపెన్ ప్లాట్ గజం ధర రూ.7,500 నిర్ణయించామన్నారు. ఈ విషయం క్షేత్రస్థాయిలోకి వెళ్లలేదని, విస్తృత ప్రచారం కల్పించి మరోసారి వేలం పాట నిర్వహిస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్ఐఐసీ జోనల్ మేనేజర్ శ్రవణ్‌కుమార్, డీఏఓ శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

# ఘనంగా ప్రతిష్ఠాపన ఉత్సవాలు

అనంతగిరి: వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని ధన్నారంలో శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ, ధ్వజ స్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. అనంతరం ప్రత్యేక హారతి ఇచ్చి తీర్థ ప్రసాదాలు అందజేశారు. మాజీ మంత్రి ప్రసాద్‌కుమార్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**నందీశ్వర ఆలయంలో..**

నవాబుపేట: మండల పరిధిలోని ముబారక్‌పూర్ గ్రామంలో ఇటీవల నిర్మించిన నందీశ్వర ఆలయంలో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, సర్పంచ్ బాలమణి, ఎంపీటీసీ దయాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రామ్రెడ్డి, వైస్ ఎంపీపీ బందయ్యగౌడ్, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు నాగిరెడ్డి, మల్లారెడ్డి, రవికాంత్, ముకుంద్ రెడ్డి, ఆనంద్ రెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




కుక్కిందకు వెళ్లే రోడ్డుపై నిలిచిన నీరు

ధారూరు: ధారూరు మండల కేంద్రంలోని బస్టాండు నుంచి కుక్కిందకు వెళ్లే రోడ్డులో చినుకు పడిందంటే చిత్తడిగా మారుతోంది. గురువారం కురిసిన వర్షానికి పీడబ్ల్యూఎస్ రోడ్డు నుంచి అశోక్ మెకానిక్ ఇంటి వరకు సీసీ రోడ్డు నీటితో నిండిపోయి చిత్తడిలా మారింది. గత సంవత్సరమే ఇక్కడ సీసీ రోడ్డు వేశారు. వర్షపు నీరు మురికి కాలువలోకి వెళ్లాల్సి ఉన్నా రోడ్డు ఎగుడు దిగుడుగా ఉండటంతో రోడ్డుపైనే నీరు నిలుస్తున్నాయి. ఈ విషయమై ప్రజలు గ్రామ పంచాయతీకి అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుపై నీరు నిలువకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.